క్లుప్తంగా

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం



అంతర్వేదిలో నిర్వహిస్తున్న స్వామి కల్యాణం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో బుధవారం ఆర్జిత సేవగా స్వామి వారి శాంతి కల్యాణం బహుళ ద్వాదశి తిథి నాడు అర్చకులు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణం విష్వక్సేన పూజతో అర్చకులు ప్రారంభించారు. వేదమంత్రాలతోను, మంగళ వాయిద్యాల నడుమ కనుల పండువగా ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన అర్చకుడు పెద్దింటి వెంకట శ్రీనివాస్, వేద పండితులు ఈ కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం స్వామి మూలవిరాట్టు దర్శనం, అలాగే లడ్డు ప్రసాదం ఇచ్చి, అన్నదాన పథకంలో భోజన సౌకర్యం కల్పించింది.

ఉచిత కంటి వైద్య శిబిరం



గూడపల్లిలో కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు తేజు

మలికిపురం: గూడపల్లి మెయిన్ పంచాయతీ వద్ద సినీనటుడు కొణిదెల చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా మామిడికుదురు అంజు హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. డాక్టర్ తేజు ఆధ్వర్యంలో కంటి పరీక్షలు, కళ్లజోళ్ల పంపిణీ, కంటి ఆపరేషన్లు నిర్వహించారు. సుమారు 200 మందికి పరీక్షలు చేశారు. ఈ కంటి వైద్య శిబిరాన్ని సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ ప్రారంభించగా కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుందర శ్రీనివాసరావు, సొసైటీ ప్రెసిడెంట్ పున్నం గంగారావు, సుందర బ్రహ్మయ్య, సుందర బుల్లబ్బులు, శివ రామప్రసాద్, కానూరి గాంధీ, ఆచంట తాతాజీ, అడబాల నాగేశ్వరరావు, సెక్రటరీ బీవీ రమణ, చిరు-పవన్ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం



ప్రహరీకి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ తాతకాపు

మామిడికుదురు: ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని లూటుకుర్రు సర్పంచ్ అడబాల తాతకాపు తెలిపారు. సమగ్ర శిక్ష నిధులు రూ.9.37 లక్షలతో నిర్మించనున్న బాడిలంక ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి సర్పంచ్ బుధవారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చొరవతో ఈ నిధులు మంజూరు అయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మద్దాల కృష్ణమూర్తి, స్థానికులు విళ్ల సుబ్బారావు, ఎంఈఓ మోకా వెంకన్నబాబు, ఎస్ఎంసీ చైర్మన్ దీపాటి ప్రసాద్, హెచ్ఎం చిక్కం రవికుమార్ పాల్గొన్నారు.

బాధితులకు సాయం పంపిణీ



కేశవదాసుపాలెంలో రాజీవ్‌కు సాయం అందజేస్తున్న జెడ్పీటీసీ అన్నపూర్ణ

సఖినేటిపల్లి: రాజోలు నియోజకవర్గంలోని రెండు గ్రామాల్లో బాధితులు ఇరువురికి ఖతార్ వైఎస్సార్ సీపీ కన్వీనర్ దొండపాటి శశికిరణ్ రూ.20 వేల ఆర్థిక సాయం బుధవారం పంపిణీ చేశారు. ఈ మొత్తాన్ని శశికిరణ్ తల్లి, సఖినేటిపల్లి జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ చేతుల మీదుగా ఆయా గ్రామాల్లో వారికి అందజేశారు. ఇందులో చింతలపల్లి గ్రామంలో రోడ్డు ప్రమాదం కాలు విరిగి వైద్యం చేయించుకుంటున్న వీరవల్లి సత్యనారాయణకు, కేశవదాసుపాలెంలో ప్రమాదవశాత్తూ రెండు చేతుల వేళ్ళు పోగొట్టుకుని వైద్యం చేయించుకుంటున్న కొల్లాబత్తుల రాజీవ్‌కు రూ.10 వేలు చొప్పున సాయం చేశారు. యెనుముల ఏసుబాబు, కొల్లాబత్తుల చిట్టిబాబు, జిల్లెళ్ల ఆనందరాజు పాల్గొన్నారు.

సాంకేతిక ప్రగతి రాజీవ్ ఘనతే

అంబాజీపేట/మామిడికుదురు: దేశంలో సాంకేతిక ప్రగతికి రాజీవ్‌గాంధీ సంస్కరణలే కారణమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. అంబాజీపేట బస్టాండ్ వద్ద రాజీవ్ జయంతిని బుధవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మామిడికుదురు బస్టాండ్ కూడలిలో రాజీవ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఆ పార్టీ నేతలు నివాళులర్పించారు.

గోదావరి ఉగ్రరూపం

- ముంపునకు గురైన అప్పనపల్లి స్నానఘట్టం
- కూరగాయల తోటలను ముంచెత్తిన వరద
- ముంపునకు గురైన పశుగ్రాసం



పి.గన్నవరం మండలం బెల్లంపూడికి తాగునీటి కోసం పడవపై టిన్నులతో వస్తున్న పెదమల్లంక ప్రజలు

మామిడికుదురు: గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి ఉగ్రరూపం దాల్చింది. గంట గంటకూ వరద పెరుగుతూ ఉండడం తీర గ్రామాల ప్రజల్ని కలవరపెడుతోంది. పాశర్లపూడి ఏటిగట్టు దిగువన ఉన్న అప్పనపల్లి కాజ్వేకు రెండు వైపులా వరద చుట్టుముట్టింది. ఈ కాజ్వే ముంపుబారిన పడే ప్రమాదం పొంచి ఉంది. దీంతో అక్కడ అధికారులను అప్రమత్తం చేశారు. అప్పనపల్లిలో బాలబాలాజీ స్వామి వారి స్నానఘట్టం పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. అక్కడ దేవస్థానం సెక్యూరిటీ గార్డులతో పాటు మహిళా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. పాశర్లపూడిబాడవ వైనతేయ వారధి వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. బి.దొడ్డవరం బాడవతో కొబ్బరి తోటలు ముంపుబారిన పడ్డాయి. భద్రాచలంతో పాటు ధవళేశ్వరంలో వరద నీటి మట్టం క్రమేపీ పెరుగుతూండడంతో లంక గ్రామాలకు వరద ముప్పు పొంచి ఉంది. వరద హెచ్చరికల నేపథ్యంలో మండల స్థాయి అధికారులను అప్రమత్తం చేశారు. గోదావరి నది ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల వల్ల గోదావరి వరద పోటెత్తింది. దీంతో లంక గ్రామాల్లోని కూరగాయల తోటలు, పశుగ్రాసం ముంపుబారిన పడ్డాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరి వరదకు పెదపట్నం మధ్యలంకతో పాటు పెటపట్నంలంక, తదితర గ్రామాల్లో సాగు చేసిన బీర, బెండ, వంగ, దొండ, మునగ, తదితర పంటలు ముంపుబారిన పడ్డాయి. రెండు రోజుల నుంచి సాధారణంగా ఉన్న వరద బుధవారం ఉగ్రరూపం దాల్చింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఆందోళన చెందుతున్న లంక గ్రామాల ప్రజలు

పి.గన్నవరం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో జిల్లాలోని వశిష్ఠ, వైనతేయ, గౌతమీ నదీపాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను దాటి వరద ఉధృతి కొనసాగుతుండటంతో లంక గ్రామాల్లోని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు, విద్యార్థులు వరద ఉధృతిలో పడవలపై ప్రయాణిస్తున్నారు. జిల్లాకు సరిహద్దులో ఉన్న పెదమల్లంక, ఆనగర్లంక, సిర్రావారిలంక, అయోధ్యలంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. మండలంలోని చాకలిపాలెం శివారు పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం కనకాయలంక కాజ్‌వేపై వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అక్కడ పడవలు ఏర్పాటు చేశారు. కనకాయలంక ప్రజలు చాకలిపాలెం నుంచి కాజ్‌వే మీదుగా పడవలపై వెళ్తున్నారు. లంకలు వరద నీట మునగడంతో పాడి రైతులు పశువులను ఏటిగట్లపైకి తరలిస్తున్నారు. అలాగే వ్యవసాయోత్పత్తులను వ్యయ ప్రయాసలతో లంక రైతాంగం పడవలపై ఒడ్డుకు తీసుకువస్తున్నారు.

తాగునీటికి ఇబ్బందులు

కోనసీమ జిల్లాకు సరిహద్దులో ఉన్న పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం పెదమల్లంక, సిర్రావారిలంక లంక గ్రామ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. పడవలపై బెల్లంపూడి గ్రామానికి పలువురు టిన్నులతో వచ్చి తాగునీరు తీసుకువెళ్తున్నారు. తమ గ్రామంలో వాటర్ ట్యాంకు పనిచేయడం లేదని, చేతి పంపుల ద్వారా స్వచ్ఛమైన నీరు రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామానికి తాగునీరు సరఫరా చేయాలని, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కొనసాగుతున్న వరద ఉధృతి

అయినవిల్లి: ముక్తేశ్వరం వృద్ధగౌతమి పాయ, ముక్తేశ్వరం-కోటిపల్లిరేవులో వరద ఉధృతి కొనసాగుతుంది. మండలంలోని పలు లంకగ్రామాల్లో పల్లపు ప్రాంతాలకు వరద చేరింది. ముక్తేశ్వరం వృద్ధగౌతమి పాయ (తొగరపాయ)లో వరద ఉధృతిగా ప్రవహిస్తుంది. ఈ పాయలో పాత వంతెన పైన రెండు అడుగుల మేర వరద చేరింది. అలాగే ముక్తేశ్వరం-అయినవిల్లిలంక మధ్య ఎదురుబిడెం వద్ద కాజ్‌వేను వరద చుట్టుముట్టింది. రాత్రికి కాజ్‌వే రహదారి ముంపునకు గురవుతుందని స్థానికులు చెబుతుతున్నారు. లంక గ్రామాల్లో ఉన్న పశువులను రైతులు మెరక ప్రాంతాలకు తరలించారు. అలాగే పంట ఉత్పత్తులు కూడా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరదతో లంక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.



పెదపట్నం మధ్యలంకలో వరద నీటిలో మునిగిన బెండ తోట



ముంపునకు గురైన అప్పనపల్లి స్నానఘట్టం



పి.గన్నవరం మండలం చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వేపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద

వరద పరిస్థితిపై సమీక్ష

అయినవిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జీవీ సరోవరరావు ఆధ్వర్యంలో బుధవారం వరదకు తీసుకోవాల్సిన చర్యలపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. వరదలకు అందరూ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విద్యాపతి, వివిధ శాఖలకు చెందిన అధికారులు ఉన్నారు.

చేపల కోసం వెంపర్లాట



ముక్కామల లాకు వద్ద కాలువలో చేపలు విక్రయిస్తున్న దృశ్యం

అంబాజీపేట: ముక్కామల ప్రధాన పంటకాలువలో చేపలు, రొయ్యలు చనిపోయినవి, బతికి ఉన్నవి నీటిపై తేలడంతో వాటిని ఇళ్లకు తెచ్చుకునేందుకు మాంసప్రియులు కాలువల వెంట వెంపర్లాడారు. ముక్కామల పంట కాలువలో వాటర్ లెవెల్‌ను బుధవారం ఇరిగేషన్ అధికారులు తాత్కాలికంగా తగ్గించారు. అయితే ఈ ప్రధాన కాలువలో చేపలు చనిపోయి ఒకొక్కటి తేలడం ప్రారంభించడంతో అటుగా వెళ్లే వారు వాటిని చూసి చేపలను పట్టుకునే పనిలో నిమగ్నమైపోవడంతో ఆ కాలువకు ఇరువైపులా సందడి నెలకొంది. మరి కొందరైతే చేపలను బహిరంగా విక్రయిస్తూ సొమ్ములు చేసుకున్నారు. ఇదిలా ఉండగా ముక్కామల, పరిసర ప్రాంతాల్లో ఉన్న కాలువలో చేపలు ఎవరూ తినవద్దని పంచాయతీ స్థానిక పంచాయతీ అధికారి మెసేజ్‌లు పెట్టారు. కాలువలో గుర్తుతెలియని వ్యక్తులు కెమికల్ ట్యాంక్ వదలడంతో కాలువలో ఉన్న చేపలకు ఆక్సిజన్ అందక చనిపోయి తేలాయని, ఆ చేపలను తినవద్దని పంచాయతీ అధికారులు ప్రజలకు వివరించారు. అయినప్పటికీ మాంసప్రియులు చేపలను పట్టుకెళ్లడంలో వెనుకాడలేదు.

ముంపునీటిని త్వరితగతిన తొలగించాలి



వేగివారిపాలెంలో రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

రాజోలు: ఇటీవల కురిసిన వర్షాలకు వరిచేలల్లో ముంపునీటిని త్వరితగతిన తొలగించుకోవాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త నందకిషోర్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు వై.సునీత, వి.రోజా రైతులకు సూచించారు. శాస్త్రవేత్తల బృందం బుధవారం కడలి, వేగివారిపాలెం గ్రామాల్లో పర్యటించింది. ఐదు రోజుల వరకు ముంపునీరు పొలం ఉన్నా పెద్దగా నష్టం ఉండదన్నారు. అయితే ముంపునీరు పొలం నుంచి దిగేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ముంపునీరు దిగిన వెంటనే వరినాట్లు పుంజుకోవడానికి ఎకరానికి 20 కిలోల యూరియా, 10 నుంచి 15 కేజీల పొటాష్ కలిపి వేసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి వై.మధుకుమార్, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా వైఎస్సార్ సీపీదే గెలుపు

- మాజీ మంత్రి గొల్లపల్లి
- గ్రామాల్లో ఉత్సాహంగా ఇంటింటికీ వంచన



పడమటిపాలెంలో పార్టీ జెండా ఎగురవేసిన మాజీ మంత్రి గొల్లపల్లి

మలికిపురం: రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైఎస్సార్ సీపీదే గెలుపు అని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మలికిపురం మండలం చింతలమోరి గ్రామంలో బుధవారం వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం పేరాబత్తుల నాగరాజు ఇంటి దగ్గర మండల పార్టీ అధ్యక్షుడు అడబాల వీర బ్రహ్మాజీ అధ్యక్షతన జరిగింది. సూర్యారావు పాల్గొని మాట్లాడుతూ ఇంత తక్కువ కాలంలో ప్రజల నుంచి చీత్కారాలు ఎదుర్కొన్న ఏకైక ప్రభుత్వం ఇదేనన్నారు. మాజీ సీఎం జగన్ అందించిన సంక్షేమ పథకాలను ప్రస్తుత సీఎం చంద్రబాబు దూరం చేశారని ప్రజలు చాలా బాధతో ఉన్నారన్నారు. జెడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి, రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రతినిధి తాడి సహదేవ్, గుర్రం జాషువా, మోకా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే పడమటిపాలెంలో గ్రామ శాఖ అధ్యక్షుడు మంద సత్యనారాయణ అధ్యక్షతన బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమం జరిగింది. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మండల జెడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా విశ్వాసం కోల్పోయిందన్నారు. నాయకులు కటకంశెట్టి ఆదిత్య, కట్టా శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ కొల్లాబత్తుల సీతామహాలక్ష్మి, తాడి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

సహకార వ్యవస్థ బాగా లేదు



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ

మలికిపురం: జిల్లా వ్యాప్తంగా సహకార వ్యవస్థ పనితీరు బాగా లేదని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నియోజకవర్గంలో ఇటీవల నియమితమైన సొసైటీ త్రిసభ్య కమిటీలకు జిల్లా సహకార అధికారులు మలికిపురంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కొత్త పాలక వర్గాలు బకాయిల వసూళ్లపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి మాట్లాడుతూ జిల్లాలో రూ.300 కోట్ల మేర సంఘాల నష్టాల్లో ఉన్నాయని వాటిని తగ్గించేందుకు కృషి చేస్తానన్నారు. సభలో డీసీసీబీ జిల్లా అధికారులు రాధా కృష్ణ, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు తదితరులు పాల్గొన్నారు.

అన్నింటా మహిళలు ముందుండాలి

అయినవిల్లి: మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ మాల కోఆపరేటివ్ ఆర్థిక సహకార సంఘం అధ్యక్షుడు పెదపూడి విజయకుమార్ అన్నారు. బుధవారం మండలంలోని సిరిపల్లి ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో పీఎం అజయ్ స్కీంలో మన్నే శాంతకుమారి ఆధ్వర్యంలో సుమారు 30 మంది మంది మహిళలకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని పెదపూడి విజయకుమార్ పరిశీలించారు. మహిళలను ఉద్దేశించి ఈసందర్భంగా మాట్లాడారు. మహిళలు అన్నింటా రాణించాలని ఆయన కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాల్ని వివరించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

అలమూరు: మండలంలోని చొప్పెల్ల, అలమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని రామచంద్రపురం ఈఈ కె.రత్నాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మత్తుల దృష్ట్యా అలమూరులోని ఇండస్ట్రియల్ విద్యుత్ లైన్ పరిధిలోని పినపళ్ల, పెదపళ్ల, సూర్యారావుపేట, చింతలూరు, కలవచర్ల, పెనికేరు తదితర గ్రామాలకు సంబంధించి ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ సరఫరా నిలిపివేయనున్నామన్నారు. ట్రాన్స్‌కో ఏడీఈ సీహెచ్.శ్రీధర్, ఏఈ డీఎంకే దుర్గాప్రసాద్, సబ్ ఇంజినీర్ వై.లక్ష్మి, లైన్ ఇన్‌స్పెక్టర్లు వాసంశెట్టి సత్యనారాయణ, కేవీవీ సుబ్రహ్మణ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో రేపు..

సఖినేటిపల్లి: ఈ నెల 22న 33 కేవీ లైన్ అండ్ 11 కేవీ ట్రీ క్లియరెన్స్ పనుల నిమిత్తం సఖినేటిపల్లి, మలికిపురం మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అమలాపురం ఈఈ కె.రాంబాబు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. పై రెండు మండలాల్లోని గ్రామాలన్నింటికీ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఆయన అన్నారు. అంతరాయానికి సహకరించాలన్నారు.

శోభాయాత్ర విజయవంతం చేయండి

రాజోలు: బీజేపీ శోభాయాత్రను పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా పిలుపునిచ్చారు. బుధవారం రాజోలులో జరిగిన సమావేశంలో అయ్యాజీ వేమా, శోభాయాత్ర ఇన్‌చార్జి మాతే శ్రీనివాస్‌నగేష్ మాట్లాడారు. ఈ నెల 25న అమలాపురంలో జరిగే శోభాయాత్రలో రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పాల్గొంటారన్నారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అధిక పాల ఉత్పత్తి సాధించాలి



పెనికేరు వైద్యశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఏహెచ్ఓ వెంకట్రావు

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో పాడి రైతులు తక్కువ పెట్టుబడితో అధిక పాల ఉత్పత్తి సాధించాలని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి (డీఏహెచ్ఓ) కె.వెంకట్రావు అన్నారు. మండలంలోని జొన్నాడ, పెనికేరు గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించి పశువుల ఆస్పత్రులను తనిఖీ చేశారు. అలాగే ఇటీవల పాడి రైతులు ఏర్పాటు చేసుకున్న మినీ గోకులాలు, సూపర్ నేపియర్, డైరీ ఫారంలను స్థానిక పశువైద్యాధికారులతో కలసి ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మినీ గోకులాలు రైతుల పురోభివృద్ధి కోసం జిల్లాలో మరిన్ని గోకులాలను మంజూరు చేస్తామన్నారు. అలాగే ప్రభుత్వం పాడి రైతులకు చేయూతను అందించేందుకువ వీలుగా రాయితీపై పశుగ్రాసం అందజేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. పెనికేరులో ఒక రైతు తన రెండున్నర ఎకరాల పొలంలో సాగు చేస్తున్న సూపర్ నేపియర్ గ్రాస్ సాగును క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. పశు వైద్యాధికారులు బి.భానుప్రసాదరావు, డి.వినోద్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన బీర్ల విక్రయం



శివకోటిలో విక్రయించిన కాలం చెల్లిన బీరు బాటిల్

రాజోలు: కాలం చెల్లిన బీర్లను శివకోటి మద్యం షాపులో విక్రయించడంపై మద్యం ప్రియులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 19వ తేదీ రాత్రి ఒక వ్యక్తి బీరు బాటిల్ కొనుగోలు చేయగా మ్యానుఫ్యాక్చర్ తేదీ 07-01-2025, ఎక్స్‌పయిరీ 05-07-2025 ఉండడంతో రాజోలు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి కాలం చెల్లిన 40 బీరు సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. దాదాపు చాలా మద్యం షాపుల్లో కాలం చెల్లిన బీరు సీసాలు విక్రయించడంతో వాటిని తాగి మద్యంప్రియులు అనారోగ్యానికి గురవుతున్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



టైలర్ కుటుంబానికి సాయం అందిస్తున్న ప్రభాకరరావు

ఆలమూరు: మండలంలోని పెనికేరులో ఇటీవల మృతి చెందిన టైలర్ నల్లమిల్లి లక్ష్మీనారాయణ (55) కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ఆలమూరుకు చెందిన శ్రీకృష్ణదేవరాయ కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు బుధవారం మృతుడు లక్ష్మీనారాయణ నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులకు రూ.ఐదు వేలు, 25 కేజీల బియ్యం బస్తా అందజేశారు. పేద కుటుంబానికి తమ వంతు అండగా నిలిచిన దాత ప్రభాకరరావును పలువురు గ్రామస్తులు కొనియాడారు.

దోమల నివారణకు సమష్టిగా పనిచేయాలి



అంబాజీపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు



నగరంలో నిర్వహించిన ప్రపంచ దోమల దినోత్సవ ర్యాలీ



చొప్పెల్లలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

అంబాజీపేట: దోమ కాటు ప్రమాదమని, నివారణకు అందరం సమష్టిగా పనిచేసి సంపూర్ణ ఆరోగ్యంగా ఉందామని పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని అంబాజీపేట పీహెచ్‌సీ పరిధిలో సబ్ యూనిట్ అధికారి ఎన్వీ రామారావు అధ్యక్షతన దోమల నివారణపై ర్యాలీని బుధవారం నిర్వహించారు. సీహెచ్‌వో బి.అప్పారావు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్‌లు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

నగరంలో..

మామిడికుదురు: దోమల వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కల్పిస్తూ నగరం, లూటుకుర్రు పీహెచ్‌సీల ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీలు నిర్వహించారు. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, మెదడువాపు తదితర వ్యాధులు దోమల వల్ల వ్యాప్తి చెందుతాయని నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి జాన్ లెవీ, రాజోలు ఎస్‌యూఓ యెరుబండి ఆదినారాయణ పేర్కొన్నారు. దోమల పట్ల అప్రమత్తంగా ఉండాలని లూటుకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి సత్యవతి సూచించారు. ఆయా కార్యక్రమాల్లో సీహెచ్‌ఓ కేఎస్ సత్యవతి, హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: దోమలను నిర్మూలించి ప్రజారోగ్యాన్ని కాపాకుందామని పెదపళ్ల, చొప్పెల్ల, పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.లక్ష్మీస్నేహ, డి.సాయికిషోర్, బి.అనంత రామకృష్ణ, కె.భాగ్యశ్రీ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు ఆయా పీహెచ్‌సీల పరిధిలో బుధవారం ప్రపంచ దోమల దినోత్సవం నిర్వహించారు. వైద్య, ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ సిబ్బంది భారీ ర్యాలీలు నిర్వహించి దోమల నిర్మూలన ఆవశ్యకతను వివరించి ప్రజలను చైతన్యవంతం చేశారు. సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, హెచ్ఈలు బి.సూర్యనారాయణ ఏవీవీ రాజా అక్కుల, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, ఆర్.బాలామణి తదితరులు పాల్గొన్నారు.

అవిడిలో..

కొత్తపేట: గంబూషియా చేపల ద్వారా క్షేత్రస్థాయిలో దోమల నివారణ సాధ్యమని మండల పరిధిలోని అవిడి పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని పలు ఖాళీ స్థలాల్లోని నీటి కుంటల్లో జిల్లా మలేరియా అధికారి ఆదేశాలపై గంబూషియా చేపలను వదిలారు.



సఖినేటిపల్లిలో దోమల నిర్మూలన దినోత్సవ ర్యాలీ

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: ప్రపంచ దోమల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకుని మండల కేంద్రంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, పీహెచ్‌సీ వైద్యులు ర్యాలీ చేశారు. సఖినేటిపల్లి పీహెచ్‌సీ వద్ద నుంచి మొదలైన ఈ ర్యాలీ ప్రభుత్వ కార్యాలయాల మీదుగా సాగింది. స్థానికంగా వర్షం నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో గంబూషియా చేపలను వదిలిపెట్టారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీడీవో కె.సూర్యనారాయణ, మండల ఆర్ఐ వేగిరాజు వెంకట రామరాజు, పీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గా కావ్య, ఎంఈవో డి.కిషోర్‌కుమార్, సీహెచ్‌వో మూర్తి, పోలీస్, రెవెన్యూ, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

వీరవల్లిపాలెంలో..

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెం పీహెచ్‌సీ వద్ద బుధవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వైద్యాధికారి లక్ష్మీసౌజన్య మాట్లాడుతూ దోమతెరలు వాడడం, నీరు నిలవ లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మలేరియా, డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులు సోకకుండా ప్రజలు అప్రమత్తమవ్వాలని ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ రాజబాబు సూపర్‌వైజర్లు రామారావు, జయలక్ష్మి, నాగేశ్వరరావు, నరేష్, ఆశా వర్కర్లు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సఖినేటిపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన వ్యక్తి వైనమిది. బుధవారం ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 18వ తేదీ రాత్రి కేశవదాసుపాలెంలో నడుచుకుంటూ ఇంటికి వెళుతున్న కొల్లాబత్తుల చంద్రమౌళి (38)ని, వెనుక నుంచి యాక్టివా బైక్‌తో ఇతర ప్రాంతానికి చెందిన ఓ మహిళ ఢీకొట్టింది. ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో బాధితుణ్ణి రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు కుటుంబ సభ్యులు హుటాహుటిన చికిత్సకు తరలించారు. ఆసుపత్రిలో బుధవారం చికిత్స పొందుతూ చంద్రమౌళి మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. ఆసుపత్రి వర్గాల సమాచారం. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన వెల్లడించారు.